గురు వారం
28-12-2023
సంపుటి - 08,
సంచిక - 417
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రజాపాలన

### రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజాపాలనపై అవగాహనలో మంత్రి ఉత్తమ్



**కరీంనగర్, డిసెంబర్ 27 (సమ సమాజం):** ఆరు గ్యారంటీలు ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రజాపాలన నిర్వహిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డులపైనా నిర్ణయం తీసుకుంటామన్నారు. రేషన్ కార్డులు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులకు ప్రజాపాలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్ చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని ఎత్తిపోతల పథకాలపై దృష్టి పెడుతానని చెప్పారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. మేడిగడ్డలో

4వ పేజీలో...

# ఆరు గ్యారెంటీల అమలుకు నేటి నుంచి శ్రీకారం

## ప్రజల సమస్యలు అన్నీ పరిష్కరిస్తాం



కొత్త రేషన్ కార్డులు లేని వారూ దరఖాస్తు చేసుకోవచ్చు ■అవసరమైన వారికి కార్డులూ ఇస్తాం

మేడిగడ్డపై విచారణ సాగుతోంది ■అప్పలకుప్పను చేసి...ఖాళీ బిందెలు ఇచ్చారు

లక్షకోట్లలో కెసిఆర్ నుంచి లక్ష రాబట్టాం ■అసెంబ్లీలో బావాబామ్మర్దులు తంటాలు పడ్డారు

22కొత్త క్రూజర్లు కొని దాచారు ■ఇలాంటివే కెసిఆర్ పెట్టిన ఆస్తులు

ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ నియామకాలు చేపడతాం ■మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** గడీల మధ్య ప్రజలకు దూరంగా జరిగిన పాలనను గ్రామాలకు తీసుకువస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజావాణిలో సమస్య పరిష్కారం కాలేదని ఓ మహిళ మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసినట్లు తెలిసింది. బాధిత మహిళకు ఆయన లక్ష సాయం అందించారు. కేటీఆర్ దోచుకున్న లక్షకోట్ల రూపాయల్లో బాధితురాలికి లక్ష ఇచ్చారు. దోచుకున్న సొమ్ము మొత్తం ప్రజలకు చేరేలా చేస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 22 కొత్త కార్లు కొని దాచి పెట్టారని అన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే వాటిని వాడుదామనుకున్నారని చెప్పారు. కెసిఆర్ సంపద సృష్టి ఈ విధంగా ఉందన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు వెనక్కి పోతే కేంద్రాన్ని నిలదీయలేని వారు ఇవాళ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. అలాగే తాము ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయి. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ లేకుండా పరీక్షల పక్రియ జరగదు. టీఎస్‌పీఎస్సీ సభ్యులు ఇప్పటికే రాజీనామాలు సమర్పించారు. గవర్నర్ నిర్ణయం తీసుకున్నాక కొత్త బోర్డును ఏర్పాటు చేసి ఛైర్మన్, సభ్యులను నియమిస్తాం. అనంతరం ఉద్యోగ నియామకాలు చేపడతాం. గ్రూప్- 2 పరీక్షలపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మేడిగడ్డకు సంబంధించి న్యాయ విచారణ జరుగుతోంది. విచారణ తర్వాత ఎల్ అండ్ టీ, అధికారుల పాత్ర ఏమిటనేది తేలుతుంది. గత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. 6.71లక్షల కోట్లు అప్పులు చేసి నిండా ముంచారు. పరిస్థితుల నుంచి తేరుకుని ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబడతాం. మహిళలకు

4వ పేజీలో...

# పార్లమెంట్ ఎన్నికల వేళ

## రాహుల్ రెండో విడత యాత్ర

- భారత్ న్యాయ యాత్రగా నామకరణం
- జనవరి 14 నుంచి మార్చి 20 వరకు కొనసాగింపు
- 14 రాష్ట్రాల్లో 6200 కిలోమీటర్ల యాత్ర
- మణిపూర్‌లో ప్రారంభం..ముంబైలో ముగింపు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 27 (సమ సమాజం):** పార్లమెంట్ ఎన్నికలు దూసుకు వస్తున్న వేళ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి యాత్ర చేపట్టనున్నారు. 'భారత్ న్యాయ' పేరిట ఈసారి యాత్ర నిర్వహించ నున్నారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి ప్రారంభించి పశ్చిమ తీరం వరకూ యాత్ర చేపట్టనున్నారు. జనవరి 14న యాత్ర ప్రారంభం కానుంది. మార్చి 20న ముంబైలో రాహుల్ యాత్ర ముగియనుంది. 14 రాష్ట్రాల్లో 85 జిల్లాల మీదుగా ఈ యాత్ర జరగనుంది. ఈ మేకు కాంగ్రెస్ షెడ్యూల్‌ను ఖారరు చేసింది. ఈసారి యాత్రను హైబ్రిడ్ మోడ్‌లో రాహుల్ గాంధీ నిర్వహించనున్నారు. బస్ ద్వారా, అక్కడక్కడా కాలినడకన రాహుల్ భారత్ న్యాయయాత్ర సాగనుంది. ఇది రాజకీయ యాత్ర కాదని.. రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని పార్టీ ప్రతినిధి కేసీ వేణుగోపాల్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి రాహుల్ గాంధీ రెండో దశ జోడో యాత్ర ప్రారంభించనున్నారు. ఈ సారి ఈ యాత్రకు 'భారత్ న్యాయ్ యాత్ర' అనే పేరు పెట్టారు. మణిపూర్ నుంచి ముంబయి వరకూ రాహుల్ పాదయాత్ర చేయనున్నారు. మొత్తం 14 రాష్ట్రాల్లోఈ యాత్ర కొనసాగనుంది. మార్చి 20న యాత్ర ముగియనుంది. 6,200 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. మేరకు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ అధికారిక ప్రకటన చేశారు. 'భారత్ జోడో యాత్రలో ఎదురైన అనుభవాల తో

4వ పేజీలో...

## మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసులు



4వ పేజీలో...


## రతన్ టాటా జీవితం స్ఫూర్తిదాయకం

### టాటా సామ్రాజ్య విస్తరణ

### లక్షలాది మందికి బతుకు దారి

### నేడు రతన్ టాటా పుట్టిన రోజు

**ముంబై, డిసెంబర్ 27 (సమ సమాజం):** పది వేల కోట్ల రూపాయలుగా ఉండవలిసిన ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడు ఒకే ఒక్కడు తన యుక్తి తో,తన వ్యాపార నిపుణతతో ఆరు లక్షల కోట్లకు ఎగబాకేలా చేసాడు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ,నూట యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన టాటా గ్రూప్‌ను అందనంత ఎత్తులో నిలబడేలా చేసాడు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు టీ నుండి ట్రక్కుల వరకు ఇలా ప్రతి వ్యాపారంలో ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది. ఇంతటి ఘన చరిత్రను టాటా



4వ పేజీలో...

## న్యూ ఇయర్ వేడుకలు

### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



4వ పేజీలో...

# సమస్యలను పట్టించుకోని పాలకులు !

'అచ్చే దిన్' అంటూ ఆశ చూపి, రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి మరోమారు అధికాంలోకి రావడమెలా అన్న వ్యూహంలో ఉంది. దక్షిణాదిలో కూడా పట్టు సాధించే క్రమంలో పావులు కదుపుతోంది. దేశ నిరుద్యోగ యువత ఆశలపై బిజెపి నీళ్లు చల్లింది. వారిని దగా చేసింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన మీ హామిని గంగలో కలిపారు. ఇప్పటిదాకా ఎన్ని కోట్ల కొలువులు ఇచ్చారో చెప్పే ధైర్యం మోడీ నేతృత్వంలోని సర్కార్‌కు లేకుండాపోయింది. ఉద్యోగావకాశాలు కల్పించకుండా పోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. రాష్ట్రాలు,కేంద్రం ఇప్పటి వరకు ఎన్ని కొలువులు ఇచ్చిందో లెక్క చెప్పడం లేదు. దేశంలోని నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ఏంచేసిందో చెప్పాలని ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ తమ రాష్ట్రంలో ఏ మేరకు నిరుద్యోగులను ఆదుకున్నారో చెప్పలేక పోతున్నారు. కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు...ఉన్న ఉద్యోగాలనే మోడీ ప్రభుత్వం తొలగి స్తోందన్నది నూటికి నూరుపాళ్లు నిజం. ఉపాధి అవకాశాల్లో బిజెపి వైఫల్యాలను తీవ్రస్థాయిలో నిరుద్యోగులు నిరసిస్తూనే ఉన్నారు. అదే సమయంలో ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రజలను తప్పుదారి పట్టించడానికే ఎప్పటికప్పుడు మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నా ఇప్పుడు చర్చ అంతా అవసరం లేని రాజకీయ సమస్యలపైనే సాగుతోంది. కోర్టుల్లోకూడా అనేకానేక కేసులు పెండింగ్‌లో ఉన్నా తక్షణ సమస్యగా బెంచ్ ముందుకు ఇలాంటివి వచ్చి చేరుతున్నాయి. ఇది వ్యవస్థాగత లోపమా లేక పాలకుల కుట్రనో అర్థం కావడం లేదు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది. మరోమారు కరోనా మహమ్మారి హెచ్చరికలతో ఇక మరింత ఉపద్రవం ఏర్పడనుందన్న భయాలు మొదలయ్యాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే దాడిచేస్తున్నాయి. ఉత్పత్తిరంగాలకు చేయూత లేకుండా పోయింది. యధారాజా తథా ప్రజ అన్న తీరులో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నుంచి కొత్తగా పన్నులు ఎలా రాబట్టవచ్చే అన్న ఆలోచనలో ఉన్నాయి. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. పండించిన ధాన్యం కొంటారన్న భరోసా లేదు. కేంద్రరంగ సంస్థలను ఇష్టం వచ్చినట్లు గా అమ్మేసే కార్యక్రమం జోరుగా సాగుతోంది. మూతపడ్డ పరిశ్రమల సంగతి సరేసరి. మోడీ ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్న తీరు తిరోగమన చర్యగానే చూడాలి. అంతేగాకుండా అసమర్థ విధానంగా కూడా చూడాలి. విశాఖ ఉక్కు లాంటి సంస్థలను తెగనమ్మడం పాడియావు పొదుగును కోయడం తప్ప మరోటి కాదు. కొత్త ఉద్యోగాల నియామకాల మాట దేవుడెరుగు కానీ ఉన్న ఉద్యోగులకు విఆర్‌ఎస్ ఇచ్చి ఇంటికి పంపేస్తున్నారు. ఉద్యోగాలను ఊడగొట్టిన పాపంలో పాలకుల ఆలోచన అంతా ఒకే విధంగా ఉంటోంది. కేవలం కార్పోరేట్ కంపెనీలను ప్రోత్సహిస్తున్న తీరు కారణంగా చిన్న కంపెనీలు అనేకం మూత పడ్డాయి. వారికి సరైన ప్రోత్సాహం దక్కడం లేదు. బ్యాంకుల కొర్రీల కారణంగా స్వయం ఉపాధి చేపట్టాల నుకున్న వారు సైతం వెనక్కి తగ్గుతున్నారు. దీనికి తోడు జీఎస్టీ దాడి విపరీతంగా ఉంటోంది. ప్రభుత్వం అంటే పన్నుల వసూళ్లు తప్ప మరోటి కాదన్న రీతిలో పాలనా వ్యవహారాలు సాగుతున్నాయి. పన్నులతో అభివృద్ధి కార్యక్రమాలు పక్కకు పోయాయి. ప్రజలను ఓటుబ్యాంక్‌గా చేసుకుని కార్యక్రమాలు రూపొంది స్తున్నారు. రాజకీయ కోణాల్లో అనేక కేసులను తెరపైకి తేవడం...ఎన్నికల ముందు జిమ్మిక్కులు చేయడం అలవాటు చేసుకున్నారు. చంద్రబాబుపై కేసులు కూడా ఇలాంటివే. రాజకీయ కక్ష తీర్చుకునే ప్రయత్నం జరిగిందే తప్ప ఇలాంటి కేసులతో కోర్టుల్లో అత్యవసర విచారణల పేరుతో ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు ఎప్పటినుంచో జరుగుతూనే ఉన్నాయి. రాజకీయపరమైన కేసులే ఇప్పుడు ప్రధాన సమస్యలుగా చిత్రీకరిస్తున్నారు. ఇలాంటి సమస్యలను ఎవరికి వారు ప్రతిష్ఠగా తీసుకుని ముందుకు సాగుతు న్నారు. దీంతో అసలు సమస్యలు పక్కకు పోతున్నాయి. ప్రభుత్వాలను గుప్పిట్లో పెట్టుకున్న నేతలు ప్రజల సమస్యను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి సమస్యల పై ప్రధానంగా దృష్టి సారిస్తాయని ఎన్నో సందర్భాల్లో రుజువు చేశారు. దీంతో ప్రజలను కూడా మానసికం గా ఇటువైపు దృష్టి సారించేలా చేస్తున్నారు.ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఇష్టం వచ్చినట్లుగా అమ్మకానికి పెట్టి, అది దేశహితం కోసమే అన్న రీతిలో ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో దేశాన్ని మార్గనిర్దేశం చేయాల్సిన పాలకులు ఎన్నికలు, ఎన్నికలకు మధ్య ఆకర్శణీయమైన పథకాలతో ముందుకు సాగుతున్నారు. ఒక ఎన్నిక నుంచి మరోఎన్నిక అన్నతీరులో పాలన సాగుతోంది. కేంద్రం దారిలోనే అన్ని రాష్ట్రాల్లో పాలన ఉంది. ఇన్నాళ్లు ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన అనేక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి మరి కొందరికి ఉపాధి కల్పించాల్సిన కేంద్రం ప్రైవేటు పరం చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉద్యోగావ కాశాలను దెబ్బతీస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పు డల్లా సమస్యలను పక్కదారి పట్టించి ప్రజల దృష్టిని మరలుస్తున్నారు. అలాగే ఇప్పుడు కరోనా కొత్త వేవ్ కారణంగా కూడా ప్రజల మనసంతా ప్రాణాలు కాపాడుకోవడమెలా అన్న దానిపై ఉంటోంది. ఇది కూడా ప్రభుత్వాలకు కలిసివచ్చే అంశంగా చూడాలి. ఇకపోతే ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడా నికి, అన్నిరంగాల్లో ప్రగతిపథంలో దూసుకెళ్తున్నట్లుగా అబద్దాల ప్రచారంలో ముందుంటున్నాయి. దీనికి చిత్తశుద్ధితో పనిచేయాలన్న సంకల్పం లేకపోవడమే కారణంగా చూడాలి. ధాన్యం ఉత్పత్తిలో స్వాలంబన సాధించినా దేశంలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తొలగించడంలో విఫలం అవుతున్నారు. ఎందుకంటే దేశంలె నేటికీ అనేక మంది పేదలు ఇంకా ఆకలితో అలమటిస్తూనే ఉన్నారు. చరిత్రలోనే రికార్డు స్థాయికి ధాన్యం ఉత్పత్తిని అన్నదాతలు ఉత్పత్తి చేస్తున్నా.. వారికి మద్దతు ధరలు కూడా దక్కకుండా చేస్తున్నార న్నారని అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీవినీ ఎరుగని ఆర్థిక సంక్షోభంతోపాటు, ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోలేక సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నారు.ప్రజాస్వామ్యం లో ప్రజలు అప్రమత్తంగా లేనంత కాలం ఇలాంటి రాజకీయాలే నడుస్తాయి. ఎవరు అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారని గమనించాలి. అందుకే ఎన్నికల ముందు మంచీచెడు విశ్లేషించాలి. తమ ఓటును ఎవరికి వేస్తే క్షేమమో ఇప్పటి నుంచే లెక్కలు వేసుకోవాలి.

# నేడు ఢిల్లీకి షర్మిల రాక

## కాంగ్రెస్‌లో చేరిక ఖాయమంటున్న నేతలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27 (సమ సమాజం):** వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిక ఖాయమని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ఆమె గురువారం ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. ఏఐసీసీ నుంచి పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో షర్మిల భర్త అనిల్ కుమార్ మకాం వేశారు. అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉందని, ముందు ఏఐసీసీలో సర్దుబాటు చేయాలని షర్మిల విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ,మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకుంటారని ఏపీ కాంగ్రెస్ ఇన్ ఛార్జి మాణిక్యం ఠాకూర్ అన్నారు. 'వైఎస్ఆర్ బిడ్డగా షర్మిల అంటే మాకు గౌరవం ఉంది. షర్మిలకు ఎటువంటి బాధ్యతలు ఇచ్చేదీ అధ్యక్షుడు ఖర్గేనే నిర్ణయం తీసుకుంటారని మాణిక్యం ఠాకూర్ తెలిపారు. మోవైపు కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రాకను ఏపీ కాంగ్రెస్ నేతలు స్వాగతిస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం ఎవరు వచ్చినా స్వాగతిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

# మహిళ పట్ల ఎస్సై అసభ్య ప్రవర్తన

## మియాపూర్ ఎస్సై గిరీశ్ కుమార్ సస్పెన్షన్

**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** మాజీ ఎమ్మెల్యే కుమారుడు ర్యాష్ డ్రైవింగ్ కేసులో నిందితుడిని తప్పించేందుకు ప్రయత్నించిన పంజాగుట్ట సీఐ దుర్గారావు సస్పెండ్ అయ్యారు. అతనిపై విచారణ జరిపిన పోలీసు ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇక తాజాగా మియాపూర్ ఎస్సై గిరీష్ కుమార్ కూడా సస్పెండ్ అయ్యారు. తనకు వచ్చిన సమస్యను పోలీసులతో విన్నవించుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ బాధితురాలితో సంబంధిత స్టేషన్ ఎస్సై అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయం తెలుసుకున్న సైబరాబాద్ సీపీ అతడిని సస్పెండ్ చేశారు. బాధ్యత గల వృత్తిలో ఉంటూ సమాజాన్ని పరిరక్షించాల్సిన ఓ ఎస్సై దిగజారి నీచంగా ప్రవర్తించాడు. సమస్య ఉందని స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఉన్న సమస్య కంటే కూడా ఎస్సై వేధింపులు తనకు మరింత ఇబ్బందికి గురిచేసింది. అమె ఫోన్ నెంబర్ తీసుకొని వేధింపులకు పాల్పడ్డాడు పోలీసు అధికారి. అతడి వేధింపులు తాళలేక బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపిన ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సై గిరీష్ కుమార్ మియాపూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల బ్యూటీషియన్‌గా పని చేస్తున్న ఓ మహిళ చీటింగ్ కేసు విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఫ్రెండ్ బిజినెస్ పేరుతో సుమారు రూ.6 లక్షలు మోసం చేశాడని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె కంప్లైంట్‌ను పరిశీలించిన ఎస్సై.. సదరు వ్యక్తిని విచారణకు పిలిపించారు. అనంతరం అతని వద్ద నుంచి డబ్బు రికవరీ చేయించారు. దీంతో ఈ కేసు తతంగం ముగిసిపోయింది. బాధితురాలికి న్యాయం జరిగిందని భావించింది. అయితే ఈ కేసు ముగిసిన తరువాత కూడా ఎస్సై గిరీష్ కుమార్ సదరు బ్యూటీషియన్ ఫోన్ నంబరు తీసుకుని వెంటపడ్డాడు. వాట్సాప్‌కు మెసేజ్‌లు పంపిస్తూ.. అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విసిగిపోయిన బాధితురాలు నేరుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్?కు ఫిర్యాదు చేశారు. సీపీ విచారణకు ఆదేశించగా.. వేధింపులు నిజమని తేలటంతో అతడిపై సస్పెన్షన్ వేటు పడింది.

# గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

## పలుచోట్ల భారీగా పట్టివేత

**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ పోలీసులు డ్రగ్స్, గంజాయి అమ్మకాలు, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. కొత్త సంవత్సరం వేడుకల ముందు పలుచోట్ల భారీగా గంజాయి పట్టుబడుతోంది. తాజాగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో 80 కేజీల గంజాయిని ఎస్ఓటీ బృందం స్వాధీనం చేసుకుంది. విశాఖపట్నం నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా నిందితులను ఎస్ఓటీ టీం సభ్యులు పట్టుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. వారి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఒక కారును సీజ్ చేశారు. నిందితులపై ఔఆఖా యాక్ట్ కింద కేసు నమోదు చేశారు రాజేంద్రనగర్ పోలీసులు. ప్రస్తుతం మాదకద్రవ్యాల పై తెలంగాణ పోలీస్ శాఖ సీరియస్ గా వ్యవహరిస్తోంది.

# కాంగ్రెస్ హామీలపై అనుమానాలు


## రైతుబంధు ఇంకా జమకాలేదు ■ నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదు: కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన్గ ÷లుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకాలు చేశారు. అయితే మిగిలిన నాలుగు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని తెలంగాణ మంత్రులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రజా పాలన పేరుతో లబ్దదారుల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు కార్యచరణను రూపొందించారు. ఈకార్యక్రమం డిశంబర్ 28 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు, మూడు అంశాల పట్ల గ్రామాల్లో ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.. ఈ అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళు ్నానన్నారు. రాష్ట్రంలో 44 లక్షల మంది పెన్షన్ దారులు వున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారికి నెలకు ఇస్తామన్న రూ. 4000 నేరుగా ఇవ్వొచ్చు అని సూచించారు. ప్రతి నెలా పెన్షన్ తీసుకునే వారిని కొత్తగా అర్జీ పెట్టుకోండి అనడం సరైంది కాదన్నారు. రైతుల అకౌంట్‌లో రైతు బంధు ఇప్పటి వరకూ జమ చెయ్యలేదని తెలిపారు. ఎప్పుడు తమ పెట్టుబడి సాయం అందుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రైతులకు ఇస్తామన్న రైతు బంధు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ఈరోజు కాంగ్రెస్ తన ప్రజాపాలనకు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేసింది. ఇందులో ముఖ్యమంత్రితో పాటూ పలు శాఖల మంత్రులు పాల్గొన్నారు. దీనిపై కూడా కవిత స్పందించారు. ఈరోజు రిలీజ్ చేసిన అప్లికేషన్‌లో నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి అని ఎక్కడ లేదు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన హామీ మేరకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. అలాగే జనవరి 1 నుండి గ్రామాల్లో 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. దీని ప్రకారం కొత్త సంవత్సరం జనవరి 1 నుండి దీనిని అమలు చెయ్యాలని ప్రభుత్వానికి తెలిపారు. దీంతో పాటు కొత్త పెన్షన్ రూ. 4000 కూడా జనవరి నుంచే అమలు చేయాలని సూచించారు. రేషన్ కార్డులు వెంటనే ఎందుకు ఇవ్వడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నట్లు కవిత చెప్పారు.

# సంక్రాంతికి ముందు కరోనా భయం

## గ్రామాలకు వెళ్లే సమయంలో టెన్షన్



**విజయవాడ, డిసెంబర్ 27 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్‌లో ఏటా అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో సంక్రాంతి.. అగ్రస్థానంలో ఉంటుంది. ఈ పండుగకు గ్రామాల్లో హడావిడి అంతాకాదు. కోడి పందాలు హైలెట్ అవుతుంటాయి. ఎంతో సందడిగా, ఆటపాటలతో, అందాల ముగ్గులతో పిండివంటలతో అత్యంత వైభవంగా జరుపుకునే సంక్రాంతి పండుగకుగాను ప్రతి ఒక్కరూ గ్రామాలు చేరుకుంటారు. అయితే కరోనాతో ఇప్పుడు మరోమారు పండగపై నీలినీడలు కమ్ముకుంటాయా అన్న ఆందోళన వస్తోంది. కొత్త వేరియంట్ వ్యాప్తితో ఇప్పుడు మళ్లీ భయాలు మొదలయ్యాయి. ఈ ఏడాది కూడా సంక్రాంతి కోసం పాఠశాలలకు సెలవులను ప్రకటించింది ప్రభుత్వం. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జనవరి 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. జనవరి 17న తిరిగి స్కూళ్లు తెరుచుకుంటాయి. ఈ విద్యా సంవత్సరం మొత్తంలో 220 రోజులు పాఠశాలలు పనిచేయనుండగా.. 80 రోజులు సెలవులు ఉంటాయి. జూనియర్ కళాశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక తెలంగాణలో 5 రోజులు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ఉన్నాయి. ఇంటర్ కాలేజీలకు ఇవే సెలవులు దినాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే భోగి పండుగా జనవరి 14న వచ్చింది. ఆ రోజు ఆదివారం కావడం, 15న సంక్రాంతి పర్వదినాన సోమవారం కావడంతో ఒకరోజు సెలవు మిస్ అవుతున్నారు. జనవరి 16న సోమవారం కనుమ పండుగకు ప్రభుత్వం ఆప్షనల్ హాలిడేను ప్రకటించింది.మరోవైపు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. ఈ క్రమంలో కొత్తగా జెఎన్-1 వేరియంట్ చాపకిందనీరులా విస్తిస్తోంది. రోజురోజుకూ క్రమంగా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో గ్రామాలకు వెళ్లాలనుకునే వారిలో భయాలు మొదలయ్యాయి.


# సింగరేణిలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

## కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం



**కరీంనగర్, డిసెంబర్ 27 (సమ సమాజం):**సింగరేణి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జక్కుండా చర్చలు తీసుకున్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం పరిధిలోని 11 డివిజన్లలో ఉదయం 7 గంటలకు ఎన్నికల పోలింగ్ మొదలవ్వగా.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 7 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభించారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం పరిధిలోని 11 డివిజన్లలో సింగరేణి ఎన్నికలు జరిగాయి. ఎన్నికల కోసం 84 పోలింగ్ కేంద్రాలు, 11 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 13 కార్మిక సంఘాలు తలపడ్డాయి. ఎన్నికల్లో 96.3శాతం పోలింగ్ నమోదైంది. భూపాలపల్లి సింగరేణిలో 94.7 శాతం పోలింగ్ నమోదు కాగా.. 5410 ఓట్లకు గాను,.. 5,123 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. భూపాలపల్లి ఏరియా సింగరేణిలో పోలింగ్ ముగిసింది. చిన్న చిన్న ఘటనలు మినహా ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 9 పోలింగ్ సెంటర్లలో ఎన్నికలు జరిగాయి. భూపాలపల్లి డివిజన్‌లో మొత్తం 5410 మంది ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియూసి. సీపీఐ అనుబంధ ంఎ÷ుజఅ సంఘాల మధ్య హోరా హోరీ పోరు జరిగింది. బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ సెంటర్‌కి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కోసం 5 టేబుల్స్ ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానుంది. సాయంత్రం 7గంటలకు ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. అర్ధరాత్రి వరకు తుది ఫలితం వెలువడనుంది.

# ఢిల్లీలో పొగమంచు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27 (సమ సమాజం):** ఢిల్లీని పొగమంచు కప్పేసింది. బుధవారం ఉదయం సమయంలో ఆవరించిన పొగమంచు కారణంగా రోడ్లపై వాహనాలు సైతం కనిపించని పరిస్థితి నెలకొన్నది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఉదయం మూడుగంటల పాటు విజిబిలిటీ జీరో స్థాయికి పడిపోయింది. పొగమంచు దట్టంగా పరుచుకోవడంతో ఢిల్లీ విమానాశ్రయంలో దాదాపు 110 విమాన రాకపోకలపై ప్రభావం చూపింది. అలాగే, 25 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 7 డిగ్రీలకు పడిపోయాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో చలిగాలులు భయపెడుతున్నాయి. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతుండటంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.

# ప్రజాపాలనపై సన్నాహక సమావేశం

## సమావేశానికి ఎమ్మెల్యేల హాజరు

## ప్రోటకాల్ పాటించడం లేదన్న సునీతా లక్ష్మారెడ్డి

**సంగారెడ్డి, డిసెంబర్ 27 (సమ సమాజం):** కలెక్టరేట్ ప్రజా పాలన కార్యక్రమంపై ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ప్రజాపాలనపై సన్నాహక సమావేశంలో నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. సమావేశాలకు నాకు సమాచారం ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ గమనించాలి. సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు..ఏం అర్థం కావడం లేదు. సీఎం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలి. రాజకీయ కక్షకి పాల్పడవద్దు...ప్లెక్సీల్లో మా ఫోటోలు లేవని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఇదిలావుంటే ప్రజా పరిపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల అమలులు ప్రభుత్వం చేపట్టిన లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పని చేయాలని ఎమ్మెల్యే సునితారెడ్డి అధికారులకు సూచించారు. హత్నూర ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 28నుంచి నిర్వహించే గ్రామ సభలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తులు స్వీకరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ ఫలాలు అర్హులకు అందాలని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజా పాలన బ్యానర్‌పై ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫోటో లేకపోవడంతో గుండ్ల మాచూనూర్ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాగులదేవులపల్లి సర్పంచ్ సుధాకర్‌లు అధికారులను నిలదీశారు. అంతే కాకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులందరం సమావేశం నుంచి సమావేశాన్ని బహిష్కరిస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే వారికి నచ్చ చెప్పి శాంతింపజేశారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఈ నెల 28నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలలో పార్టీలకతీతంగా పారదర్శకంగా లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేస్తామని చెప్పారు. ప్రజా పాలనపై నారాయణఖేడ్‌లో నియోజకవర్గంలోని అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 6 తర్వాత కూడా అర్హులు ఉంటే దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిపక్షాల నాయకులు ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా యత్నిస్తే అధికారులు భయపడాల్సిన అవసరం లేదని, పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఫారాలు రిజెక్ట్ కాకుండా చూడాలన్నారు. పథకాలను అర్హులైన వారికి అందించే విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. అధికారులు చట్టంపరిధిలో పని చేస్తూ, అర్హులకు పథకాలు అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ మాట్లాడుతూ.. ఒక్క దరఖాస్తు రిజెక్ట్ కాకుండా అన్ని దరఖాస్తులు పూరించే విధంగా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో అన్నిశాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామసభల నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయతీ ఖాతాలో రూ.10వేలు జమ అవుతాయన్నారు.


# అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు

### క్రీడల్లో దూసుకుపోతున్న అడపులుల

### విమెన్స్ టోర్నీ ప్రారంభించిన మంత్రి రోజా

**తిరుపతి, డిసెంబర్ 27 (సమ సమాజం):** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆడ పులులు క్రీడల్లో దూసుకుపోతున్నారని మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆమె బుధవారం శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీలో ఇంటర్ స్టేట్ యూనివర్సిటి ఉమెన్స్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఏపీలో 'ఆడుదాం ఆంధ్రా' నిన్నటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీకు వస్తే తన పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడుకు 175 సీట్లకు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఉందని విమర్శించారు. రాష్ట్రం పరిస్థితి దేవుడు ఎరుగు.. కుప్పం నియోజకవర్గం అయినా కాపాడుకోవాలని బాబు పర్యటనకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు సీఎంగా, 40 ఏళ్లుగా కుప్పం ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రెవెన్యూ డివిజన్‌లో వేల పెన్షన్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలను ఇచ్చింది సీఎం జగన్ అని తెలిపారు. 2024లో చంద్రబాబును కుప్పంలో ప్రజలు ఫుట్‌బాల్ ఆడుతారని మంత్రి రోజా అన్నారు. ఏపీని అభివృద్ధి చేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చూపిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వెళ్తే సూసైడ్ చేసుకున్నట్లేనని ఆమె తెలిపారు. పదవులే పరమావధిగా ఉన్నవాళ్లకు పార్టీలు మారితే భవిష్యత్ ఉండదని మంత్రి రోజా అన్నారు.

# జనసేనలో చేరిన వైకాపా ఎమ్మెల్సీ వంశీకృష్ణ



### కార్పొరేటర్లతో సహా జనసేన పార్టీలో చేరిక

### వంశీ లాంటి నేతలు రాష్టానికి అవసరమన్న పవన్

**అమరావతి, డిసెంబర్ 27 (సమ సమాజం):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జనసేన పార్టీలో చేరారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులున్నాయి. అయితే తాను వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నందున అధికారికంగా కండువా కప్పించుకోలేదు. తన అనుచరులకు జనసేన కండువాలు కప్పించారు. తన వర్గానికి చెందిన కార్పొరేటర్లతో ఆయన జనసేన పార్టలో చేరిపోయారు. వంశీ కృష్ణ ఇపై సోషల్ మీడియాలో ప్రచారం సాగుతుండడంతో.. నిన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు.. వంశీని కలిసి చర్చలు జరిపారు. పార్టీ మారే ఆలోచన లేదని వంశీకృష్ణ తనకు చెప్పారని ఈ సందర్భంగా వెల్లడించారు.. దీనిపై మాత్రం వంశీ కృష్ణ స్పందించలేదు. కానీ, నేడు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయానికి వైసీపీ ఎమ్మెల్సీ వంశీ కృష్ణ అనుచరులతో సహా వెళ్లి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. వంశీతో నాకు 2009 నుంచే పరిచయం ఉందని పవన్ అన్నారు. ప్రజా రాజ్యం యువజన విభాగం యువరాజ్యం అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచి వంశీతో నాకు పరిచయం ఉందన్నారు. ఎమ్మెల్సీగా ఉండి కూడా వంశీ జనసేనలోకి వచ్చిన ఆయనని మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నాను.. వంశీ తన సొంతింటికి వచ్చారు.. ఆయన పార్టీలోకి వచ్చిన విధానం నాకు నచ్చింది.. వంశీ ఏ నమ్మకంతో జనసేనలోకి వచ్చారో.. ఆ నమ్మకం కొల్పోకుండా పార్టీ అండగా ఉంటుంది అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. వంశీని నేనో నియోజకవర్గం దృష్టిలో నేను చూడడం లేదు.. వంశీ వంటి నేతలు రాష్ట్రానికి అవసరం.. వంశీకి చాలా బలంగా పార్టీ అండగా ఉంటుందని పవన్ హామీ ఇచ్చారు. వంశీ కృష్ణ శ్రీనివాస్ ప్రజారాజ్యం పార్టీ నుంచే రాజకీయ ప్రవేశం చేశారు. యాదవ సామాజికవర్గంలో బలమైన స్థానం ఉన్నప్పటికీ, 2019 ఎన్నికలకు ముందు విశాఖ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే టిక్కెట్ నిరాకరించడంతో వైసీపీ పార్టీతో వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌కు విభేదాలు మొదలయ్యాయని చెబుతున్నారు. ఆ తర్వాత వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్ష పదవిని కట్టబటెట్టింది వైసీపీ.. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 21వ వార్డు నుండి కార్పొరేటర్‌గా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. అయితే, 11వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందిన జి.హరి వెంకట కుమారిని మేయర్‌గా పార్టీ ఎన్నుకోవడంతో ఆయన మళ్లీ నిరుత్సాహానికి గురయ్యారు. మేయర్‌గా ఎన్నిక కాకపోవడంతో మనస్తాపానికి గురైన వంశీకృష్ణ.. నగర పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు . కొంతమంది వైసీపీ నాయకులు తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత రంగంలోకి దిగిన వైఎస్సార్‌సీపీ అధిష్టానం.. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది.. కానీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్న ఆయన.. ఇప్పుడు జనసేనలో చేరారు. జనసేనలో చేరే ఎవరికీ టిక్కెట్ ఆఫర్లు ఇవ్వడం లేదని.. టిక్కెట్ అంశాలపై చర్చలు జరిపినప్పుడు.. మాత్రమ మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

# కోడి పందాలకు మొదలైన ఏర్పాట్లు

### అనుమతులు లేవని అంటున్న పోలీసులు

### ఎవరికి వారు సంక్రాంతి బరికి రెడీ

**ఏలూరు, డిసెంబర్ 27 (సమ సమాజం):** సంక్రాంతి సందర్భంగా కోడి పందేలను నిషేధించే విషయంలో ఎలాంటి సమాచారం లేకపోవడంతో గతంలో ఉన్న ఆదేశాలకు అనగుణంగా పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. కోడిపందాలపై నిషేధం లేదని ఎవరికి వారు నిర్ణయం చేసుకుంటున్నారు. సంప్రదాయబద్ధంగా పందాలు నిర్వహించుకుంటే అభ్యంతరం లేదంటున్నారు. అయితే విచ్చలవిడిగా పందాలకు అనుమతులు లేవని అంటున్నారు. ప్జలు పందాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ మేరకు సిఎంతో డిజిపి సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు వివిధ జిల్లాల్లో కోడిపందాల నిర్వహణ జరక్కుండా ఇప్పటి నుంచే చర్యలకు దిగుతున్నారు. కోడిపందేలపై కఠిన వైఖరి అవలంబించనున్నట్లు పోలీస్ అధికారుల ద్వారా స్పష్టం అవుతోంది. సంక్రాంతి ముగిసే వరకు పుంజులను స్వాధీనం చేసుకుంటారు. కోడి పుంజులకు కత్తులు కట్టే వారిని, పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకుంటారు. ఆయా ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయనున్నారు. తెలిపారు. నదీ, సముద్ర తీర ప్రాంతాలు, లంకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఎక్కడెక్కడ పందేలకు కోళు పెంచుతున్నారు, ఏయే ప్రాంతాల్లో పందేలు నిర్వహించే అవకాశం ఉందో సమాచారం తెప్పించుకుని చర్యలు తీసుకుంటారు. మరోవైపు గతంలో ఎవరెవరు కోడిపందేలలో పాల్గొన్నారో వారి వివరాలను సేకరిస్తున్నారు. పండుగకు కుటుంబ సభ్యులు, బంధువులకు దూరం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కోడి పందేలకు కత్తులు తయారు చేసేవారు, కత్తులు కట్టే వారి వివరాలు కూడా తమ వద్ద ఉన్నాయని తెలిపారు. వారందరిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. తిరిగి పందేలకు సిద్ధమైతే చర్యలు తప్పవన్నారు. గతంలో ఏ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహించారు, అందులో ఎవరెవరు పాల్గొన్నారు అనే వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. పాత కేసుల్లో నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తామంటున్నారు. పోలీసు హెచ్చరికలు భేఖాతరు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# 16వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె




### మరింత ఉధృతంగా ఆందోళనలు ❑ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఇల్లు ముట్టడి

**విజయవాడ, డిసెంబర్ 27 (సమ సమాజం):** అంగన్వాడీల సమ్మె 16వ రోజుకు చేరింది. ఊరూవాడా అంతటా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలవంతం కాకపోవడంతో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. మంగళవారం ప్రభుత్వం, అంగన్వాడీల సంఘాలకు జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతరాహితంగా వ్యవహరించింది.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి చేయాలని మూడు సంఘాల ఆధ్వర్యంలో నిర్ణయించారు. దీనిలో భాగంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనిలో భాగంగానే మండలంలోని ఇర్రిపాక స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నివాసాన్ని ముట్టడించి మండుటెండ లో నిరసన తెలిపారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల అంగన్వాడి వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ 16 రోజులైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు సుజాత, రత్నం, అనంతలక్ష్మి, గంగాభవాని, రాజేశ్వరి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఎమ్మెల్యే బయటకొచ్చే సమాధానం చెప్పేంతవరకు కదిలేది లేదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# అభయహస్తం దరఖాస్తు..లోగో విడుదల

### నేటినుంచే గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ

### సచివాలయంలో విడుదల చేసిన సిఎం రేవంత్, మంత్రులు

### ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నామన్న సిఎం




**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా బుధవారం ఉదయం సచివాలయంలో అభయ హస్తం కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇతర మంత్రుల సమక్షంలో ఆరు గ్యారెంటీల దరఖాస్తు పత్రాన్ని విడుదల చేశారు. ప్రజాపాలన లోగోను సీఎం రేవంత్ ఆవిష్కరించారు. ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారెంటీల ప్రొఫార్మాను రూపొందించారు. గురువారం28 వతేదీనుంచి ఆరు గ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ మొదలుకానుంది. జనవరి 6 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేందుకు కృషి చేస్తోందని అన్నారు. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారంను విడుదల చేసి ప్రజలకు భరోసా ఇచ్చారు. డిసెంబరు 28 నుంచి గ్రామాలు, పట్టణాలు, మున్సిపల్ వార్డుల్లో ఐదు పథకాలకు మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తాం. ఎనిమిది పనిదినాల్లో గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. జనవరి 7లోపు లబ్దిదారుల వివరాలు సేకరించేందుకు యత్నిస్తున్నాం. అర్హులైన లబ్దిదారులకు పథకాలు అందించాలని నిర్ణయించాం. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి న్యాయం చేసేందుకు యత్నిస్తుంది. ప్రతి మండలానికి తహసీల్దార్ బాధ్యత వహిస్తారు. ప్రతి అధికారి రోజూ రెండు గ్రామాలను సందర్శిస్తారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులందరూ దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. ప్రతీ మండలంలో రెండు గ్రూపులుంటాయని.. ఒకటి..ఎండీవో..మరొకటి ఎమ్మార్వో అని చెప్పారు. గ్రామసభల్లో మహిళలకు, పురుషులకు సపరేట్ కౌంటర్లు ఉంటాయని తెలిపారు. గ్రామసభల్లో దరఖాస్తు పెట్టుకోలేని వాళ్లు తహసీల్దార్, పంచాయితీ ఆఫీసుల్లో దరఖాస్తులు పెట్టుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో వేల ధరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వానే ప్రజల వద్దకు తీసుకువెళ్లాలనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. నాలుగు పేజీల అభయ హస్తం దరఖాస్తులో వివఅలు ఇలావున్నాయి. దఖాస్తుదారుని పేరు, లింగ నిర్ధారణ, కులం వివరాలు, పుట్టిన తేదీ, ఆధార్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్, మొబైల్ నెంబర్, వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.దరఖాస్తుదారుని పూర్తి చిరునామా.. ఇంటి నెంబర్, వీధి, గ్రామం, మున్సిపాలిటీ, కార్పొరేషన్, వార్డు నెంబర్, మండలం, జిల్లా వివరాలు నమోదు చేయాలి. మహాలక్ష్మి పథకం వివరాలు ఉంటాయి. ప్రతినెలా 2 వేల 500 రూపాయల ఆర్థిక సాయం అవసరమా లేదా అనే కాలం ఉంటుంది. 500 రూపాయల గ్యాస్ సిలిండర్ కోసం వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. గ్యాస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కంపెనీ పేరు, సంవత్సరానికి ఎన్ని గ్యాస్ సిలిండర్లు వినియోగించుకుంటున్నారు అనే సంఖ్య ఇవ్వాలి. రైతుభరోసా కిందరైతునా.. కౌలు రైతునా అనే వివరాలు ఇవ్వాలి. పట్టాదారు పాసు పుస్తకం నెంబరు ఇవ్వాలి. సాగు చేస్తున్న భూమి వివరాలు అయిన సర్వే నెంబర్లు, విస్తీర్ణం వివరాలు నమోదు చేయాలి. అదే విధంగా వ్యవసాయ కూలీలకు ఏటా ఇచ్చే 12 వేల రూపాయలకు సంబంధించి ఉపాధి హామీ కార్డు నెంబర్ నమోదు చేయాలి. ఇల్లులేని అర్హులైన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ఉంది. అమరవీరులు,ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అమరవీరుల పేరు, అమరలైన సంవత్సరం.. ఎఫ్ఐఆర్ నెబర్, డెత్ సర్టిఫికెట్ నెంబర్ నమోదు చేయాలి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారా లేదా అనే వివరాలు ఇవ్వాలి. ఒక వేళ జైలుకు వెళ్లినట్లయితే జైలు పేరు, స్థలం, శిక్ష సంబంధించిన వివరాలు.. శిక్షా కాలం వివరాలు నమోదు చేయాలి. గృహ జ్యోతి పథకం కింద కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తారు. మీ నెలసరి గృహ విద్యుత్ వినియోగం ఎంత ఉంటుంది. 100 యూనిట్ల.. 200 యూనిట్ల, 200 యూనిట్లపైన ఉంటుందా అనేది నమోదు చేయాలి. అదే విధంగా కరెంట్ మీటర్ కనెక్షన్ సంఖ్య నమోదు చేయాలి. చేయూత పథకం కింద నెలకు 4 వేలు మరియు దివ్యాంగుల పింఛన్ 6 వేలు పొందేందుకు వివరాలను తెలపాలి. ప్రస్తుతం ఫించన్ పొందుతున్న వారు కొత్తగా దరఖాస్తు నమోదు చేయాల్సిన అవసరం లేదు. దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికెట్ నెంబర్. ఇతరులు అయితే వృద్యాప్య పింఛన్, వింతు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీ కార్మికుల జీవన భృతి, ÷ల్ల÷లేరియా బాధితులు, ఒంటరి మహిళ జీవన భృతి, బీడీ టెకేదార్ జీవన భీతి వివరాలు నమోదు చేయాలి.

# రావమ్మ మహాలక్ష్మి రావమ్మా!

### షర్మిల కోసం కాంగ్రెస్ నేతల ఆరాటం

### కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పడుంతా ఇదే చర్చ



**విజయవాడ, డిసెంబర్ 27 (సమ సమాజం):** ఏపి రాజకీయాల్లో ఇప్పుడు కాంగ్రెస్ హాట్ టాపిక్‌గా మారింది. దీనికితోడు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో మకాం వేశారు. నిజానికి ఏపి కాంగ్రెస్‌లో సమర్థ నేత లేదా, గట్టి నాయకుడు లేడనే చెప్పాలి. తెలంగాణలో అధికాంలోకి వచ్చాక ఇప్పుడు ఏపిలోనూ అధికారం సాధించడమెలా అన్న చర్చ సాగుతోంది. ఈ క్రమంలో వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరుతారని, ఆమె పిసిసి చీఫ్ అవుతారని ప్రచారం సాగుతోంది. కర్ణాటక, తెలంగాణలో గెలుపు తర్వాత దక్షిణాదిన బలం పెంచు కోవాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది. పదేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌పైనా ఫోకస్ చేస్తోంది. ఏపీ కాంగ్రెస్ నేతలతో అధిష్టానం సమావేశం ఉద్దేశ్యం కూడా ఇదేనని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. అసలు.. ఏపీ రాజకీయాలపై షర్మిల ఆలోచన ఏంటన్నది తెలియాల్సి ఉంది. తన అన్న జగన్‌కు వ్యతిరేకంగా షర్మిల రాజకీయం చేస్తారా అన్నది చూడాలి. ఆమె అక్కడ అధికా జగన్‌ను ఢీకొంటారా అన్న చర్చ సాగుతోంది. ఇదిలావుంటే.. వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భవిష్యత్ ఎంటన్నది ఆసక్తిగా మారుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి కండిషన్స్ లేకుండా కాంగ్రెస్‌కు మద్దతిచ్చి బరి నుంచి తప్పుకున్నారు. అయితే.. అంతకుముందు కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌టీపీ విలీనంపై పలుమార్లు చర్చలు జరిగినా ఫలించలేదు. కానీ.. సార్వత్రిక ఎన్నికల వేళ షర్మిల టాపిక్ మరోసారి తెరపైకి వస్తోంది. షర్మిల పొలిటికల్ ఫ్యూచర్‌పై.. ఆమె ఏం ఆలోచిస్తున్నారనే అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే.. ఇవాళ ఢిల్లీలో జరగనున్న ఏపీ కాంగ్రెస్ నేతలతో హైకమాండ్ చర్చల్లో షర్మిల ఎపిసోడ్‌పై ఫోకస్ చేసే అవకాశం ఉంది. నిజానికి.. గతంలో కాంగ్రెస్‌తో జరిపిన చర్చల సమయంలోనే పార్టీని విలీనం చేసి.. ఏఐసీసీలో కీలక పదవిని షర్మిల ఆశించినట్లు తెలిసింది. దానికి తగ్గట్లుగానే.. తెలంగాణ ఎన్నికలు ముగిసిన తర్వాత ఏపీపై ప్రత్యేక దృష్టి పెట్టి షర్మిలను రంగంలోకి దింపాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది. నిజానికి తెలంగాణలో విజయం తర్వాత ఏపీపై కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ పెంచింది. ఏపీలోనూ పుంజుకుని పునరుత్తేజం వచ్చేలా కృషి చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఆ దిశగా పయనించేందుకు ఏపీ కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరుపుతోంది. ఇప్పటికే.. ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా మాణిక్కం ఠాకూర్‌కు బాధ్యతలు అప్పగించింది. తెలంగానలో పరా÷–టీ విజయానికి కృషి చేసిన ఠాకూర్ ఇక్కడా పావులు కదిపే అవకాశం ఉంది. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ నేతృత్వంలో జరగనున్న ఏపీ కాంగ్రెస్ నేతల సమావేశంలో.. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. ఏపీలో కాంగ్రెస్ బలోపేతం, ఇండియా కూటమి పొత్తులు, చేరికల అంశాలపైనా అధిష్ఠానం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. అదేసమయంలో.. వైఎస్ షర్మిల చేరికపై క్లారిటీ రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. షర్మిల చేరికపై హై కమాండ్ నిర్ణయం తీసుకుంటుందని.. ఆమె చేరిక ఏపీ కాంగ్రెస్‌కు బూస్టప్ అవుతుందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ గిడుగు రుద్రరాజు అన్నారు. అందుకు.. షర్మిల కూడా ఇంటర్నల్‌గా కాంగ్రెస్ అధిష్టానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ నడుస్తోంది. దాంతో.. షర్మిలకు కీలక బాధ్యతలు అప్పగించాలన్ననిర్ణయానికి హైకమాండ్ వచ్చినట్లు సీనియర్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.


# ఉత్తరాది నుంచి చలిగాలులు పెరుగుతున్న చలి

**హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం):** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఉత్తరాది నుంచి తెలంగాణలోకి బలమైన గాలులు వీస్తున్నాయని, దీంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరో రెండ్రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉందని పేర్కొన్నారు. జనవరి ఒకటో తేదీ తర్వాత చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో వైపు హైదరాబాద్ శివారులో చలిపులి పంజా విసురుతోంది. ఉదయం పూట బయటకు



రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. చలి తీవ్రత పెరగటంతో చిన్నారుల్లో నిమోనియా సహా పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గవదబిళ్లల సమస్యలతో చిన్నారులు భారీగా ఆసుపత్రుల్లో చేరుతున్నారని చెప్పారు.

# రతన్ టాటా జీవితం స్ఫూర్తిదాయకం



(మొదటి పేజి తరువాయి) గ్రూప్ కు కట్టబెట్టేలా చేసాడు అతను. అతనే రతన్ టాటా. కొన్ని కోట్ల మంది భారతీయులకు ఆదర్శప్రాయుడు ఈ జీవన విజేత. 1937 డిసెంబర్ 28 న దేశంలోనే ధనిక కుటుంబంలో జన్మించాడు రతన్ టాటా. ఏడేళ్ల వయసులోనే తల్లి తండ్రులిద్దరూ విడిపోవటంతో నాయనమ్మ దగ్గర పెరగవలిసి వచ్చింది. తన చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని ఆర్‌జెడి టాటా పిలుపు మేరకు జంషెడ్ పూర్ లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు రతన్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగగలిగాడు రతన్. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేసిన తరువాత 1991 లో టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్ గా భాద్యతలు స్వీకరించాడు రతన్. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు అఫ్ మెంబెర్స్ లో చాలా మంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. కానీ వారికి ఆనాడు తెలియదు పాపం ఇతడే టాటా గ్రూప్ ను దశదిశలా వ్యాపించే ఘనుడు అవుతాడని... చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత టాటా గ్రూప్‌లో సమూల ప్రక్షాళన చేసాడు రతన్. రాత్రి పగలు కష్టపడి పదివేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని తన అసాధారణ వ్యాపార నైపుణ్యంతో ఆరు లక్షల కోట్ల విలువ చేసే కంపెనీగా మార్చాడు రతన్. దేశ వాణిజ్య , పారిశ్రామిక పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. నేడు టాటా గ్రూప్ 90 కి పైగా దేశాలలో విస్తరించి వందకు పైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచం లోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబడింది. వ్యాపార సామ్రాజ్యంలో ఒక శిఖరంగా ఎదగగలిగింది.ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో కేవలం లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెను సంచలనాన్నే సృష్టించాడు రతన్.. నానో కారు ఓ సంచలనం: టాటా గ్రూప్ భారత దేశానికి ఎన్నో కొత్త కొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియా గా పిలబడుతున్న విమానయాన సంస్థను మొదట టాటాఎయిర్ లైన్స్ పేరుతో 1868 లో జంషెడ్ జీ టాటా స్థాపించాడు. కాలక్రమంలో అది కాస్త ప్రభుత్వం చేతిలోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్లీ టాటా ల చేతికే వచ్చింది. అలాగే భారత దేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్ హోటల్ ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్ కు చెందిన టేట్లి అనే కంపెనీని టాటా టీ లో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టీ కంపెనీ గా టాటా టీ ఎదిగింది. అంతే కాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూప్ లో కలుపుకొని టాటా ను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేసాడు. 1998 లో టాటా ఇండికా కార్లను ప్రవేశ పెట్టారు. అయితే దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటం తో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించాడు. ఇందు కోసం అమెరికా లోని ఫోర్డ్ కంపెనీకి తన టీం తో పాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ చైర్మన్,రతన్ టాటా ను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని అవమానించాడు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాలనుండి లాభాల లోకి రావటం మొదలు పెట్టింది.కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా , అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్ ,లాండ్రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయం లోనే రతన్ ఆ రెండు కంపెనీలను నేను కొంటాను అని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేసాడు రతన్. అప్పుడు ఫోర్డ్ కంపెనీ చైర్మన్ తన టీం తో అమెరికా నుండి ముంబై కు వచ్చాడు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పాడు రతన్. నానో కార్ల ఉత్పత్తి కోసం పశ్చిమ బెంగాల్ లో ఏర్పాటు చేసిన ఎ÷-లాంటును అక్కడి రైతులు వ్యతిరేకించడంతో ,ఆ ఎ÷-లాంటు మరొక చోటుకు మార్చటంతో వేల కోట్ల నష్టాన్ని చూడవలసి వచ్చింది. పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తాజ్ హోటల్ పై జరిపిన ఉగ్ర దాడిలో వందల మంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సివచ్చింది. ఈ సంఘటన రతన్ ను మానసికంగా ఎంతో బాధించింది. లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంతవరకు ఏనాడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వటం జరుగుతుంది. దేశ సామజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టులు ఎంతగానో కృషి చేస్తున్నాయి.తాజ్ ఉగ్ర దాడిలో నష్టపోయిన వారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారి గా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా. తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అంతే కాదు భారత ప్రభుత్వం పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లతో రతన్ ను గౌరవించింది. కోట్లకు అధిపతి అయినా ఏనాడూ కుసుమంత గర్వాన్ని కూడా ప్రదర్శించలేదు రతన్ టాటా. 84ఏళ్ళ వయసులోనూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ కోట్ల మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నాడు రతన్.నేడు రతన్ టాటా అంటే ఒక వ్యక్తి కాదు,ఒక సంస్థ , ఒక బ్రాండ్. వీటన్నిటికీ మించి సృజనాత్మకత , దార్శనికత ఉన్న ఒక గొప్ప మానవతావాది. నేడు 130 కోట్ల మంది భారతీయులు మనసారా సగర్వంగా ఇతడు మా భారతీయుడు అని చెప్పుకునే వారిలో ముందు వరుసలో ఉంటాడు రతన్ టాటా. అతని సాగించిన జీవన ప్రయాణం నేడు మనందరికీ స్ఫూర్తిదాయకం.

# ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రజాపాలన



(మొదటి పేజి తరువాయి) జరిగిన అవకతవకలపై పరిశీలించేందుకు డిసెంబర్ 29వ తేదీన వెళ్తున్నామని తెలిపారు. 39 రూపాయలకు కిలో చొప్పున బియ్యం కొనుగోలు చేసి.. రూపాయికే అందిస్తున్నామన్నారు. ఆ బియ్యం నాణ్యత మరింత పెరగాలని కోరుకుంటున్నామని చెప్పారు. రేషన్ బియ్యాన్ని రీసైకిలింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిద్ధిపేటజిల్లాలోని హుస్నాబాద్‌లో ప్రజా పాలనపై నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. 28 నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజా పాలన విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రతీ కుటుంబానికి అందేలా దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. అప్పులపై స్వేద పత్రం విడుదల చేసిన బీఆర్ఎస్ నాయకులు, ముందు కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై సొధ పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షన్ దారులకు ప్రతీ నెల ఒకటవ తేదీ నుండి ఐదో తేదీలోపు జీతాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# న్యూ ఇయర్ వేడుకలు



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం): నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు పలు ఆంక్షలు విధిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. 31, డిసెంబర్ నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఓఆర్‌ఆర్‌ను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలకు తప్ప ఇతర లైట్ మోటార్ వాహనాలకు అనుమతి లేదు. పివిఎన్‌ఆర్ ఎక్స్ప్రెస్ వే రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నారు. విమానాశ్రయం వెళ్లే వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 11 నుంచి ఉదయం ఉదయం 5 గంటల వరకు కింది ఫ్లై ఓవర్లు మూసివేయ నున్నారు. శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్, గచ్చిబౌలి ఫ్లై ఓవర్, బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్ , షేక్ పేట్ , మైండ్ స్పేస్ , రోడ్ నెం.45 ఫ్లై ఓవర్లు ,దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, సైబర్ టవర్ ఫ్లై ఓవర్, ఫోరమ్ మాల్-జెఎన్‌టియూ, ఖైత్లాపూర్, బాబు జగ్జీవన్ రామ్ ఫ్లై ఓవర్లు (బాలానగర్) మూసివేయనున్నారు.

# మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసులు



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం): బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడిపై పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. సోహెల్ పంజాగుట్టలో రాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమయ్యాడు. అయితే ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు డ్రైవర్‌ను లొంగిపొమ్మని చెప్పాడు. తనకు బదులు డ్రైవర్ అబ్దుల్‌ను పోలీస్ స్టేషన్‌కు పంపించాడు. ప్రమాదం చేసి నేరుగా ముంబైకి వెళ్లిపోయిన సోహెల్.. అక్కడి నుంచి దుబాయ్‌కి పారిపోయాడు. ఈ క్రమంలో సోహెల్ కోసం పంజాగుట్ట పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. దుబాయ్‌లో ఉన్న సోహెల్‌ను రప్పించేందుకు పంజాగుట్ట పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

# గడీల పాలనను ప్రజల చెంతకు తెచ్చాం



(మొదటి పేజి తరువాయి) ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల పరిస్థితిని ముందే ఊహించాం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటాం. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తే పథకాలకు ఉపయోగపడుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చూస్తే.. ఖాళీ బిందెలే ఉన్నాయి.. కేసీఆర్ అండ్ ఫ్యామిలీ మొత్తం ఊడ్చుకుని వెళ్లిందంటూ స్పష్టం చేశారు. మేం లంకె బిందెలు అని వస్తే.. ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని.. ఇప్పుడు అంతా సెట్ రైట్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు బంధు పథకం డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. గతంలో నాలుగు నెలలపాటు వేస్తూ వచ్చారని.. గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన మొదలుపెట్టారని.. ఇప్పుడు డిసెంబర్ 20వ తేదీ నుంచి నిధుల జమ చేస్తూ వస్తున్నట్లు వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం.. అన్ని ఖాతాలను ఖాళీ చేసి వెళ్లాడని.. ఖజానా ఖాళీ చేసి వెళ్లాడని స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. గత పదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేదని, ప్రజావాణిలో వచ్చిన 24 వేల ఫిర్యాదులే అందుకు ఉదాహరణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు మోయలేని భారాన్ని గత పదేళ్లలో మోసారని అన్నారు. ఒకప్పుడు ప్రజలకు సమస్యలు ఉంటే ప్రభుత్వం దగ్గరకు వస్తే గడీలు అడ్డుగోడలుగా ఉండేవని, కానీ ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు నడిచి వెళ్తోందన్నారు. ప్రజా పాలనలో ప్రజలకు తమ మీద మరింత విశ్వాసం కలుగుతుందన్నారు. గతంలో గడీల మధ్య పాలనా నడిచిందని.. ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల కోసం వారి వద్దకు వెళ్తుందన్నారు. ఒకప్పుడు సచివాలయం అంటే ఏదో తెలియదని, సచివాలయం లోపల మీడియా సమావేశం ఉంటుందని ఎవరైనా ఊహించారా అని అడిగారు. ఇక మీదట సెక్రటేరియెట్‌లో మీడియా సెంటర్ ఉంటుందన్నారు. మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. గతంలో ఎల్ అండ్ టి కట్టిన భవనాలు ఇక్కడ ఉండేవని, ఈ భవనాలను ఏ ఆస్పత్రికో ఉపయోగించి, మరోచోట సచివాలయం కట్టివుంటే నిధులు ఆదా అయ్యేవని అన్నారు. ఇలా ఎందుకు కట్టారో తెలియంది కాదన్నారు. కేటీఆర్ తన లక్ష కోట్ల దోపిడీలో లక్ష రూపాయలు సహాయం చేసేలా చేశామన్నారు. త్వరలో కూడా మరిన్నీ కూడా కక్కించే పరిస్థితి తీసుకువస్తామన్నారు. అసెంబ్లీ బావ బామర్దులు ఆరాటమే కనిపించిదని.. మేం అసెంబ్లీలో వాస్తవాలు చెప్పామన్నారు. ప్రజావాణి వందకు వంద శాతం పూర్తి అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సైనిక్ స్కూల్ ఎందుకు ఆగిందో బీఆర్ఎస్ వాళ్లే చెప్పాలన్నారు. కేసీఆర్ 22 ల్యాండ్ క్రూజర్లు కొని విజయవాడలో దాచిపెట్టారని ఆరోపించారు. మూడోసారి సీఎం అయ్యాక వాటిని వాడాలని అనుకున్నారని తెలిపారు. ఒక్కో ల్యాండ్ క్రూజర్ ధర రూ. 3 కోట్లు ఉంటుందన్నారు. 2 లక్షల ఉద్యోగాలను ఖచ్చితంగా భర్తీ చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసి.. రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే చెబుతోంది. అయితే.. తాము అప్పుల కంటే ఆస్తులను సృష్టించి.. రాష్ట్రానికి అందించామని బీఆర్ఎస్ చెబుతోంది. ఈ రెండు పార్టీల మధ్య మరో కొత్త విషయం ప్రజలకు తెలిసింది. బీఆర్ఎస్ వాళ్లు ఆస్తులు కాదు.. అప్పులు చేసి వెళ్లారంటూ తనదైన స్టైల్లో చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కాన్వాయ్ కోసం నేను కొత్త బండ్లు కొనను.. ఖర్చు పెట్టను అని ముందుగానే అధికారులకు చెప్పాను. పాతబండ్లనే రిపేర్ చేసి, అడ్జెస్ట్ చేసి ఇవ్వండి అని అధికారులకు చెప్పాను. అయితే.. నేను సీఎం అయిన10 రోజుల తర్వాత ఒక విషయం తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 22 కొత్త ల్యాండ్ క్రూజర్లు కొని దాచి పెట్టింది. ఈ విషయాన్ని ఓ అధికారి వచ్చి నాతో చెప్పాడు. కొత్త 22 ల్యాండ్ క్రూజర్లను విజయవాడలో దాచి పెట్టాం. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయగానే మళ్లీ తీసుకొద్దామని అనుకున్నామని చెప్పాడని తెలిపారు. అసలు ఇన్ని వందల వాహనాలు ఉన్నప్పుడు కొత్తవి అవసరమా..? అని ప్రశ్నించారు. ఒక బండికి దాదాపు మూడు కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, బు÷-లలెట్ ప్రూఫ్ చేయిస్తే.. ఇంకొంచెం ఎక్కువ ఖర్చు అవుతుందన్నారు. ఇలాంటివి కేసీఆర్ సృష్టించిన సంపద అని చెప్పారు. 22 కొత్త ల్యాండ్ క్రూజర్ల వాహనాలు ప్రభుత్వ ఆస్తి.. తప్పనిసరిగా వాటిని తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పార్లమెంట్ ఎన్నికల వేళ



(మొదటి పేజి తరువాయి) రెండోసారి రాహుల్ గాంధీ పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఈ సారి యువత, మహిళలతో పాటు అన్ని వర్గాలతోనూ ఆయన మాట్లాడతారు. మొత్తం 6,200 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగనుంది. మణిపూర్, నాగాలాండ్, అసోం, మేఘాలయా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ మీదుగా యాత్ర సాగుతుంది. చివరకు మహారాష్ట్రలో ముగుస్తుంది. ఈ సారి కాలినడకనే కాకుండా బస్‌లో యాత్ర కొనసాగుతుంది. తేడాది సెప్టెంబర్ 7వ తేదీన ఫస్ట్ ఫేజ్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి మొదలైంది. దాదాపు 12 రాష్ట్రాల మీదుగా 4 వేల కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర కశ్మీర్‌లో ముగిసింది. దాదాపు 136 రోజుల పాటు రాహుల్ గాంధీ ఈ యాత్ర చేశారు. అయితే...ఫస్ట్ ఫేజ్‌లో పూర్తిగా పాదయాత్ర చేశారు రాహుల్ గాంధీ. ఈ సారి మాత్రం హైబ్రిడ్ మోడ్‌లో సాగనుంది. అంటే...కొంత దూరం వరకూ నడక ద్వారా ఆ తరవాత వాహనాల్లో యాత్ర చేయనున్నారు.ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ డీలా పడింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఈ ఫలితాలతో కాంగ్రెస్ మరోసారి ఆత్మపరిశీలన లో పడింది. లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా పుంజుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రాహుల్ గాంధీ రెండోసారి జోడో యాత్ర నిర్వహించనున్నారు.

# మాజీ ఐఎఎస్ ఇంటిని సొంతం చేసుకునే యత్నం

## ఐపిఎస్ నవీన్ కుమార్ అరెస్ట్



హైదరాబాద్, డిసెంబర్ 27 (సమ సమాజం): ఈ మధ్య కొంతమంది పోలీసులపై తీవ్ర ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. కొందరు భూకబ్జా కేసుల్లో ఇరుక్కుంటున్నారు. మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంకొందరు మాత్రం ఇల్లీగల్ పనులు చేస్తూ పోలీస్ శాఖకే మచ్చ తీసుకొస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఈ తరహా ఘటనలకు సంబంధించి.. చాలామంది పై స్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఆరోపణలు, విమర్శలు వచ్చి.. సస్పెండ్ కు గురయ్యారు. తాజాగా మరో పోలీసు అధికారిపై ఆరోపణలు రావడంతో ఆయన్ను అరెస్ట్ చేశారు. పోలీస్ అకాడమీ ఎస్పీ నవీన్ కుమార్ ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ భన్వర్ లాల్ ఫిర్యాదుతో ఐపీఎస్ నవీన్ కుమార్ ని అదుపులోకి తీసుకుని.. సీసీఎస్ పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. హైదరాబాద్ బేగంపేటలో రిటైర్డ్ ఐఏఎస్ భన్వర్ లాల్ ఇంట్లో కొంతకాలం నుంచి ఎస్పీ నవీన్ కుమార్ అద్దెకు ఉంటున్నారు. ఫేక్ డాక్యుమెంట్స్ క్రియేట్ చేసి.. తమ ఇళ్లును సొంతం చేసుకోవాలని ఎస్పీ నవీన్ కుమార్ ప్రయత్నం చేస్తున్నారని ఉన్నతాధికారులకు భన్వర్ లాల్ ఫిర్యాదు చేశారు. దీంతో సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి.. ఎస్పీ నవీన్ కుమార్ ను అదుపులోకి తీసుకుని.. విచారిస్తున్నారు.

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS. Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in